

పలువురు డిఎస్‌పిలకు స్థానచలనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలువురు డిఎస్‌పిలకు బదిలీలు జరిగాయి. ఈమేరకు డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దిశ శ్రీకాకుళం డిఎస్‌పి ఎస్.వాసుదేవ్ విజయనగరం జిల్లా దిశ డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం ట్రాఫిక్ డిఎస్‌పిగా పనిచేస్తున్న సిహెచ్.జి.వి ప్రసాద్ విశాఖపట్నం టాస్క్‌ఫోర్స్ ఎసిపిగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి కె.బాలరాజు విశాఖపట్నం మెరైన్ డిఎస్‌పిగా, విజయనగరం దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు శ్రీకాకుళం దిశ డిఎస్‌పిగా, విశాఖపట్నం టాస్క్‌ఫోర్స్ డిఎస్‌పి ఎ.త్రినాధరావు శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచ్ డిఎస్‌పిగా నియమితులయ్యారు.

చివరి బడ్జెట్‌లోనూ చేయి విదల్చలేదు

- 'ఉపాధి'కి అరకొర కేటాయింపులు
- పాత ఆదాయ పన్ను పరిమితే కొనసాగింపు
- ప్రస్తావన లేని రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి అంశం
- అన్ని వర్గాలకూ నిరాశ

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సిక్కోలువాసులను తీవ్ర నిరాశపరిచింది. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈసారైనా కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కుతుందని అంతా భావించారు. విభజన చట్టం అమల్లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలకు ఐదేళ్లుగా నిలిపేసిన కేంద్ర ప్రభుత్వం, దాన్ని పునరుద్ధరిస్తుందేమోనని ఆశించినా దాని ప్రస్తావనే లేదు. మరోవైపు రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి రైల్వే లైన్ల అభివృద్ధి తప్ప కొత్త ప్రాజెక్టులు, కొత్త రైళ్లేవీ కేటాయించకపోవం మరింత నిరాశకు గురిచేసింది. ఆదాయపు పన్ను పరిమితిలో మార్పులేవీ చేయకపోవడంతో అటు వేతనజీవులూ ఉసూరుమన్నారు. మొత్తమ్మీద కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై అన్ని తరగతులనూ అసంతృప్తికి గురిచేసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో 3.90 లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి ఆరు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు అమలు కాలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనైనా ఏదైనా నిర్ణయం తీసుకుంటుందని రైతులు ఆశగా చూసినా ఫలితం కనిపించడం లేదు. పైగా పంట ఉత్పత్తుల సేకరణ, ఆధునిక నిల్వ వసతులు, సరఫరా, మార్కెటింగ్ వంటి అంశాల్లో పిపిపి విధానాన్ని ప్రోత్సాహించనున్నట్లు పేర్కొంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం సందేహంగానే ఉంది. ఎన్నికల వరంగా రైతులకు కిసాన్ సమ్మాన్ నిధిని మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందనే వార్తలు వచ్చిన బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందారు.

'ఉపాధి' కేటాయింపులు అంతంతమాత్రమే

వ్యవసాయ పనుల్లేని సీజన్‌లో వ్యవసాయ కార్మికులు, కూలీలకు కాస్తాకూస్తో పనులు కల్పించి ఊతమిస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి స్వల్పంగా కేటాయింపులు పెరిగాయి. పనులకు డిమాండ్, వలసల నేపథ్యంలో కేటాయింపులు ఏ మూలకూ సరిపోవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళం నుంచి 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించగా, బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.89,400 కోట్లు కేటాయించినప్పుడు జిల్లా వాటాగా రూ.192 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.60 వేల కోట్లు కేటాయించగా రూ.186 కోట్లు వచ్చాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించడంతో, ఈ సంవత్సరం అంతే రూ.190 కోట్ల వరకు నిధులు సమకూరవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు దక్కాయి. జిల్లాలో మొత్తం 7.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా 6.07 మంది కూలీలు పనుల్లోకి క్రమం తప్పకుండా వస్తున్నారు. వీరందరికీ పనులు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవని అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు మౌలిక వసతుల కల్పనపైనా ప్రభావం చూపనుంది. మెటీరియల్ కాంపొనెంట్ పనుల రూపంలో వందల కోట్ల నిధులు సమకూరుతున్నాయి. వీటితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి వినియోగించడానికి దోహదపడుతోంది. ఉపాధి చట్టానికి సరిపడా నిధులు కేటాయించకపోవడంతో కూలీలకు పనులు తగ్గి వలసలు పెరిగే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ

రాష్ట్ర విభజన చట్టం హామీల్లో భాగంగా వెనుబడిన జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున కేటాయించాల్సి ఉంది. ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఈ నిధులు కేటాయించాల్సి ఉంది. 2015 నుంచి 2018 వరకు ప్రతి ఏడాది రూ.50 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం 2019 నుంచి ఆ నిధులను ఆపేసింది. తాజా బడ్జెట్‌లోనూ దాని ప్రస్తావన లేదు.

వినపడని రైల్వే కూత

రైల్వే బడ్జెట్ అనగానే కొన్ని నెలల ముందు నుంచీ అంతా ఆసక్తిగా ఎదురుచూసేవారు. మన ప్రాంతానికి ఏమైనా కొత్త రైళ్లు వేస్తున్నారా?, గతంలో ఇచ్చిన మోడల్ స్టేషన్ల హామీకి కార్యరూపం దాలుస్తుందా?, రైళ్లకు అదనపు హాల్ట్‌లు కల్పిస్తున్నారా? అసలు ఏం ప్రకటిస్తారోనని ప్రజలు ఉత్కంఠగా చూశారు. ముఖ్యంగా విశాఖ రైల్వేజోన్‌పై ఏదైనా ప్రకటన వస్తుందని అంతా ఆశించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైల్వేపరంగా జిల్లాకు మొండిచేయి చూపింది. కొత్త రైళ్లు లేకపోగా జిల్లా మీదుగా వెళ్తూ ఆగకుండా వెళ్తున్న రైళ్లకు హాల్ట్‌లు కూడా దక్కలేదు. రైళ్ల పొడిగింపు, స్టేషన్ల అభివృద్ధి ప్రస్తావనే లేదు. బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్ అంశం ప్రస్తావించని ప్రభుత్వం, అనంతరం రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశాఖ రైల్వే జోన్‌కు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వంపై నెపం నెట్టేశారు.

వేతన జీవులకు నిరాశే

పన్నుల విషయంలో ఈ ఏడాది బడ్జెట్‌లోనూ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో పన్నుల విధానాల్లో మార్పు జోలికి వెళ్లలేదు. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఆదాయపు పన్ను పరిమితి రూ.ఏడు లక్షలను యదావిధిగా కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. దీంతో వేతన జీవులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీలు, ఆశాలకు ఆయుష్మాన్ వర్తింపు

అంగన్‌వాడీలు, ఆశావర్కర్లకు ఆయుష్మాన్ భారత్ వర్తింప చేయనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. ఈ పథకం కింద కార్డు కలిగిన వారికి ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో రూ.ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్న విషయం తెలిసిందే. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటికే రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఇది ఏ రకంగా ఉపయోగపడుతుందంటూ వారు పెదవివిరుస్తున్నారు. బడ్జెట్‌లో వేతనాలు పెంచుతారని ఆశిస్తే ఆయుష్మాన్ భారత్‌తో ప్రభుత్వం సరిపెట్టిందంటూ వారు నిట్టూరుస్తున్నారు.

పిఎంఎవై గృహాలు మంజూరు

ప్రధానమంత్రి గృహ ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా మరో రెండు కోట్ల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాకు సమారు 3,500 నుంచి నాలుగు వేల వరకు కొత్త ఇళ్లు మంజూరవుతాయని అధికారులు చెప్తున్నారు. అయితే 2021-22 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకే ప్రస్తుతం దిక్కు లేకుండా పోయింది. 2021-22లో జిల్లాకు 3,751 ఇళ్లు మంజూరు కాగా, అందులో ఇప్పటివరకు 454 ఇళ్లే పూర్తయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై 16న నిరసన కార్యక్రమాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ తెలిపారు. ఈ నిరసనల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్నాయని విమర్శించారు. ప్రజాధనంతో నిర్మించిన రైల్వే, టెలికాం, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకులు, ఆయిల్ సెక్టార్, విద్యుత్, రోడ్లు, పోర్టులు తదితర ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జీడికి గిట్టుబాటు ధరపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం వెంటనే చేపట్టాలని, రిమ్స్ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రమోట్ చేయాలని, వంశధార కాలువ మరమ్మతులు చేసి ఇచ్ఛాపురం వరకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు జి.సింహాచలం, ఎన్.షణ్ముఖరావు, కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, సిర్ల ప్రసాద్, పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన ఉద్దానం

- ఎలుగు దాడిలో నలుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్ర గాయాలపాలైన నారాయణమ్మ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఉద్దానం ప్రాంతంలో ఎలుగుబంటుల దాడి ఉలిక్కిపడేలా చేసింది. మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధిలోని ఎం.గడూరు, డెప్పూరులో ఎలుగుబంటులు దాడి ఘటనలో గురువారం నలుగులురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం ఎం.గడూరుకు చెందిన పిన్నాసి కుమారస్వామి ఉదయం ఎనిమిది గంటల సమయంలో సముద్ర తీరం నుంచి వస్తుండగా మార్గమధ్యంలో తల్లి, పిల్ల ఎలుగుబంటులు కనిపించాయి. దీంతో ఆందోళన చెందిన ఆయన చెట్టు ఎక్కాడు. కుమారస్వామిని గమనించని తల్లి ఎలుగుబంటి ముందుకు వెళ్లిపోగా, పిల్ల ఎలుగుబంటి చెట్టు ఎక్కుతున్న కుమారస్వామిని కిందికి లాగేసింది. దీంతో తల్లి బంటి వచ్చి కుమారస్వామి తలపై కుడి భాగంలో, పొట్ట, కుడి కాలుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.

డెప్పూరుకు చెందిన లైశెట్టి నారాయణమ్మ తోటలోని రేగుపళ్లు ఏరేందుకు వెళ్లగా ఆమె ముఖంపై ఎలుగుబంటి దాడి చేసి కన్ను భాగంలో తీవ్రంగా గాయపరిచింది. అదే గ్రామానికి చెందిన పొకల ఊర్మిళ, శీలం తాతారావు కంచె పనులు చేస్తుండగా వారిపై ఎలుగుబంట్లు దాడికి ప్రయత్నించే సమయంలో అక్కడే ఉన్న పిన్నాసి చలపతిరావు, పెంపుడు కుక్కలు ఎలుగుబంటులను ఎదురించాయి. ఊర్మిళ, తాతారావు చేతికి గ్లౌజులు ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ నలుగురిపై రెండు ఎలుగులు దాడి చేశాయా?, మూడు ఎలుగులు దాడి చేశాయో కచ్చితంగా తెలియడం లేదు. గాయపడిన కుమారస్వామి, నారాయణమ్మను స్థానికులు ఆటోలో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 108లో తరలించారు. 2022 మేలో మండలంలోని కిడిసింగిలో రైతుపై ఎలుగుబంట్లు దాడి చేసి పొట్టన పెట్టుకున్నాయి. అదే నెలలో వజ్రపుకొత్తూరులో ఆరుగురిపై దాడి చేయగా చికిత్స పొందుతూ ఒకరు, చికిత్స అనంతరం ఒకరు మృతి చెందారు. మళ్లీ ఇప్పుడు నలుగురిపై దాడి చేయడంతో ఉద్దానం ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాశీబుగ్గ అటవీశాఖ అధికారి మురళీకృష్ణం నాయుడు మాట్లాడుతూ ఎలుగులు ఎదురైనపుడు కవ్వింపుచర్యలకు పాల్పడవద్దన్నారు. ఆత్మరక్షణ కోసం ఆయుధాలు ధరించాలని సూచించారు. ఎస్ఐ మధుసూదనరావు, అటవీశాఖ అధికారులు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జిల్లాకు చేరుకున్న కొత్త కలెక్టర్

నేడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితులైన మనజీర్ జిలానీ సమూన్ కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఒక హోటల్‌లో బస చేసిన ఆయనకు పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు ఎస్.భరత్‌నాయక్, సిహెచ్.రంగయ్య, డిఐపిఆర్ఒ ఎడి చెన్నకేశవులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు తదితరులున్నారు.

కాసులు కురిపించిన కోనేం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కోనేం, ట్యూనా చేపల సీజన్ అనుకూలించడంతో మండలంలోని మంచినీళ్లపేట మత్స్యకారుల పంట పండింది. పెద్ద మొత్తంలో చేపలు లభ్యం కావడం, మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గురువారం వేకువజామున ఏడు సంప్రదాయ బోట్లతో మత్స్యకారులు వేటకు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వేట ముగించుకుని ఒడ్డుకు చేరారు. అన్ని బోట్లలో కలిపి సుమారు వెయ్యి కిలోల వరకు కోనెం, 200 కిలోల ట్యూనా చేపలు చిక్కాయి. వీటిని స్థానిక వ్యాపారుల వద్దకు చేర్చి బేరం కుదుర్చుకున్నారు. నాలుగు కిలోల లోపు ఉన్న కోనెం (కొమరం మీనం) కిలో రూ.550, ఆపై ఉన్న కోనేం కిలో రూ.650 పలికింది. దీంతో వెయ్యి కిలోల కోనేం, 200 కిలోల ట్యూనా చేపలు సుమారు రూ.5.5 లక్షలకు అమ్ముడుపోయాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కోనేం కిలో రూ.800, ట్యూనా రూ.250 పలుకుతుందని మత్స్యకారుడు శంభురావు తెలిపారు. ఈ చేపలను వ్యాపారులు ట్రక్కుల్లో విశాఖపట్నం తరలిస్తున్నారు.



ఒడ్డుకు చేర్చిన కోనేం, ట్యూనా చేపలు

ఎంపిడిఒలకు పోస్టింగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన 19 మంది ఎంపిడిఒలకు పలు మండలాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఇద్దరు, ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 17 మందిని జిల్లాకు కేటాయించారు. వీరికి స్థానాలు కేటాయిస్తూ జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	మండలం
కె.వెంకన్నబాబు	పాతపట్నం
కె.ఎస్ కొండలరావు	పలాస
ఎం.రత్నం	సరుబుజ్జిలి
డి.స్వరూపారాణి	హిరమండలం
బి.కళ్యాణి	గార
వై.పద్మజ	కోటబొమ్మాళి
సిహెచ్.సూర్యనారాయణ	పొందూరు
వై.వి రాజేంద్ర ప్రసాద్	ఇచ్ఛాపురం
ఎం.సతీష్	శ్రీకాకుళం
పి.త్రివిక్రమరావు	కొత్తూరు
కె.విజయలక్ష్మి	టెక్కలి
జి.గిరిబాల	ఎల్.ఎన్ పేట
కె.రామకృష్ణరాజు	జి.సిగడాం
జి.భాస్కరరావు	లావేరు
ఎం.వి.బి సుబ్రమణ్యం	వంగర
ఎస్.రామకృష్ణ	సంతకవిటి
కె.సాల్మన్ రాజు	వీరఘట్టం
కె.కిషోర్ కుమార్	భామిని
జి.పైడితల్లి	పాలకొండ

పారిశ్రామికాభివృద్ధిలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పలాస



మాట్లాడుతున్న రవికుమార్

పరిశ్రమలు వస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూడా సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పలాసలోని టిడిపి కార్యాలయ ఆవరణలో ప్రొఫెషనల్ వింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతి చేయాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 55 వేల ఎకరాలను సేకరించారని తెలిపారు. రాజధాని నిర్మాణం జరిగి ఉంటే ఈ సమయానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎన్నో పరిశ్రమలు ఏర్పడి ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు లభించి ఉండేవన్నారు. రాజధాని అంటే కార్యాలయాలు కాదని పరిశ్రమలను నెలకొల్పినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమరావతి పూర్తి చేసి ఉంటే ఐదు లక్షల ఉద్యోగాలు వచ్చేవన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా, అరాచక పాలనతో ఉన్న పరిశ్రమలు బయటకు వెళ్లిపోయాయని చెప్పారు. ఉద్యోగాలు రావాలంటే రాజధాని నిర్మాణం తప్పనిసరి అని అన్నారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ టిడిపి హయాంలో జీడిపిక్కల బస్తా రూ.14 వేలు ఉంటే, వైసిపి ప్రభుత్వంలో రూ.ఏడు వేలకు పడిపోయిందన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పది శాతం కూడా చేయలేకపోయారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాల్లో జీడి, కొబ్బరి బోర్డును ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ మాట్లాడుతూ టిడిపి హయాంలో రిజర్వాయర్‌ను కళింగదళ్, డబార్సింగి, దామోదరసాగర్ రిజర్వాయర్లను నిర్మించి రైతులకు సాగునీరు అందించామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, దువ్వాడ హేంబాబుచౌదరి, టంకాల రవిశంకర్ గుప్తా, గాలి కృష్ణారావు, యువకులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు రాష్ట్రపతి ప్రశంసలు

- మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ విభాగంలో జిల్లావాసి రాణింపు
- గతేడాది 1.60 లక్షల కంపెనీల ఏర్పాటుకు అనుమతులు జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సిక్కోలు యువకుని ప్రతిభకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రశంసలు లభించాయి. 2016 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన మెట్ట రవికుమార్ ఢిల్లీలో మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రీ ఆఫ్ కంపెనీగా పనిచేస్తున్నారు. తన నాయకత్వంలో 2023లో దేశంలో అత్యధికంగా 1.60 లక్షల కంపెనీల ప్రారంభానికి అనుమతులు జారీ చేసి రికార్డు సృష్టించారు. ఆయన ప్రతిభను మెచ్చిన రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభల బడ్జెట్ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో ఒక కంపెనీకి అనుమతులు ఇవ్వాలంటే 15 రోజులు దాటేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా కేవలం ఒకట్రెండు రోజుల్లోనే అనుమతులు ఇచ్చి కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తున్న రవికుమార్‌తో పాటు ఆయన బృందాన్ని రాష్ట్రపతి మెచ్చుకున్నారు. కుమారుడు విధుల్లో చూపుతున్న చిత్తశుద్ధి, సాధించిన ఘనతపై శ్రీకాకుళం నగరంలో నివసిస్తున్న ఆయన తల్లిదండ్రులు మెట్ట సత్యనారాయణ, వెంకటరత్నం హర్షం వ్యక్తం చేశారు. విధుల్లో రాణిస్తూ రాష్ట్రపతి ప్రశంసలు అందుకోవడంపై రవికుమార్ స్వగ్రామమైన ఎచ్చెర్ల మండలం సనపలవాని పేటలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు కలెక్టరేట్ సమీపంలో శ్రీ జ్యోతిరావు పూలే పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరెండర్ లీవ్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ మెడికల్ రీయింబర్స్‌మెంట్, డిఎలు, పిఆర్‌సి రూపంలో ఉన్న రూ.కోట్లలో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. పిఆర్‌సిలో లోపాలను ఇప్పటికీ సరిదిద్దకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కొత్త పిఆర్‌సి ప్రాతిపదికన 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు.మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ఊరించి ఆరు వేలు పోస్టులకే పరిమితం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30 వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు వీలుగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తుంటే ఉపాధ్యాయులపై నిర్బంధాలు విధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, సహాధ్యక్షులు కె.దాలయ్య, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు బి.శంకరరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, బి.గౌరీశ్వరరావు, బి.శారద, ఎం.వి.రమణ, హనుమంతు అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



పూజిత

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ తృతీయ ఏడాది సిఎస్ఇ చదువుతున్న హడ్డుబంగి పూజిత అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నన్నయ యూనివర్సిటీలో జరిగిన 70 కేజీల సౌత్ జోన్ మహిళా విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. సౌత్ జోన్ నుంచి జాతీయ స్థాయికి 16 మందికి ఎంపిక చేయగా, ఐతమ్ నుంచి పూజిత ఎంపిక కావడం హర్షనీయమన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు జరగబోయే జాతీయస్థాయి పోటీలో పాల్గొంటున్నట్లు చెప్పారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఇ హెచ్ఐడి డాక్టర్ యు.డి.ప్రసన్న, స్పోర్ట్స్ కన్వీనర్ డాక్టర్ పి.మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహనరావు, జె.తేజశ్వరి, ఐతమ్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డి.వెంకటేష్ అభినందించారు.


ట్రోఫీని అందజేస్తున్న సర్పంచ్ రాజు

'ఆడుదాం ఆంధ్రా' విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వాలీబాల్ విభాగంలో కొమరల్తాడకు చెందిన మహిళల జట్టు నియోజకవర్గం, జిల్లాస్థాయిలో ప్రథమంగా నిలిచారు. ఈ మేరకు సర్పంచ్ చింత రాజు గురువారం ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి వెలికి తీస్తున్నారని అన్నారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి అవకాశాలు ఉంటాయని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల వాలీబాల్ విభాగంలో పాల్గొన్న క్రీడాకారులు సిహెచ్.ఆశ, ఎం.గాయత్రి, సిహెచ్.శిరీష, సిహెచ్.జ్యోతి, కుసుమ, ఎం.ధనలక్ష్మి, ఎం.మోనికలను అభినందించారు. కార్యక్రమంలో ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు, సభ్యులు మండల మహేష్, చింత మోహనరావు, కొంకి మోహిని పాల్గొన్నారు.


ట్రోఫీతో కవిటి క్రికెట్ జట్టు

క్రికెట్ విజేత కవిటి

కవిటి : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో కవిటి జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. నరసన్నపేట జట్టుతో గురువారం జరిగిన తుది పోరు జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన నరసన్నపేట జట్టు పది ఓవర్లకు ఏడు వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కవిటి జట్టు కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి మరో నాలుగు ఓవర్లు ఉండగానే విజయం సాధించింది. జట్టు సాధించిన విజయంపై జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.

ఇంటింటికీ తాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజలకు తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మండలంలో నారిపేట, దిబ్బలపేట, కంచరాపువానిపేటలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నూతనంగా నిర్మించిన తాగునీటి కుళాయిలను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులను చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. తాగునీరును వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, చిరంజీవి నాగ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ లలిత కుమారి, జెఇ చంద్రమౌళి, పంచాయతీ సెక్రెటరీ హరీష్, నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగన్ గెలవాలి

పొందూరు: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనగాసాలంటే మళ్లీ సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం తోలాపిలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ, దుంపల శ్యామలరావు, పప్పల అన్నాజీ, పప్పల రమణమూర్తి, గణపతిరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.


కుళాయిని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

ఎన్ఎంఎంఎస్‌లో అఖిల ఉత్తీర్ణత

ప్రజాశక్తి- ఆమదాలవలస


అఖిల

అంతర్జాతీయ సైకత శిల్పి గేదెల హరికృష్ణ కుమార్తె గేదెల అఖిల గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విజయం సాధించింది. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యను అభ్యసిస్తున్నది. పట్టణంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణులుకాగా అందులో అఖిల ఒకరు. ఆమె ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నెలాఖరులోగా రెన్యువల్ చేసుకోవాలి

రణస్థలం రూరల్: మండలంలో పైడిభీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులు సొసైటీ రుణాలను ఫిబ్రవరి నెలాఖరులోగా రెన్యువల్ చేసుకుంటేనే రాయితీ వర్తిస్తుందని సిఇఒ గిరి బుచ్చిరంగనాథం ప్రకటనలో తెలిపారు. గతేడాది తీసుకున్న, రెన్యువల్ చేసుకున్న తేదీ నుంచి సంవత్సరంలోపు పంట రుణాలు తీసుకున్న వారు 7 శాతం వడ్డీ చెల్లించి కిసాన్ క్రెడిట్ కార్డులో నమోదు చేయించుకోవాలన్నారు. బయోమెట్రిక్, 1బి, ఆధార్ కార్డు రెండు జిరాక్స్‌లు, 3 ఫొటోలు సంఘ కార్యాలయానికి అందించి రుణాలు రెన్యువల్ చేసుకొని ప్రభుత్వం నుంచి జగనన్న సున్నావడ్డీ పథకం ద్వారా కట్టిన వడ్డీ నేరుగా మీ అకౌంట్ ద్వారా పొందవచ్చునన్నారు. లేనిఎడలా 13.5 శాతం అధిక వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

రణస్థలం: మండలం బండిపాలేంలో శ్మశానవాటిక వద్ద బోరు నిర్మాణానికి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ ఆర్గనైజేషన్ సెక్రటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మజ్జి వెంకట రమణ, మాజీ సర్పంచ్ మహాదాసు రమణయ్య, మాజీ ఎంపిటిసి జనార్ధన, గొర్లె హరి, కరిమజ్జి అప్పలనాయుడు, కరిమజ్జి చిన సత్యం, వార్డుమెంబర్లు లంక రామారావు, పెంటయ్య, లంక రమణ, సూరి, చంటి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ భానోజీనాయుడు

ప్రోటోకాల్ ఉల్లంఘనపై హైకోర్టును ఆశ్రయిస్తా

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రి నూతన భవనాలను ప్రారంభించే సమయంలో తనను ఎందుకు అవమానించారని, ప్రోటోకాల్ ఎందుకు పాటించలేదని, ఈ ఉల్లంఘనపై హైకోర్టును ఆశ్రయిస్తానని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. పలాస ప్రభుత్వాస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ చైర్మన్ ఎవరు? శిలాఫలకంలో ప్రోటోకాల్ ప్రకారం తన పేరు వేరే చోట ఎందుకు వేశారు? అలా పేరు వేయమని ఎవరు చెప్పారు? ఆస్పత్రి నిర్మాణం చేసిన పనులకు బిల్లులు ఎంత చెల్లించారు? చెప్పాలంటూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో సభ్యునిగా ఉన్నప్పుడు రెండున్నరేళ్లుగా సమావేశాలకు తనకు ఎందుకు ఆహ్వానించడం లేదో చెప్పాలని అధికారులను నిలదీశారు. 24 గంటల్లో వేసిన శిలాఫలకాన్ని తొలగించకపోతే హైకోర్టులో పిటిషన్ వేస్తానని హెచ్చరించారు. హాజరు పట్టికలో 11 మంది డాక్టర్లను చూపించి నలుగురు డాక్టర్లు డిప్యూటేషన్‌పై వస్తున్నట్లు చెబుతూ మరో ఇద్దరు వైద్యులు బయటకు వెళ్లారని, కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే విధి నిర్వహణలో ఉండడాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సుశీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి విజిట్ బుక్‌పై సంతకం చేసి శిలాఫలకంపై తన పేరు ఎక్కడో ఒకచోట ఎందుకు పెట్టారో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని వెనుదిరిగారు.


ఆస్పత్రి అధికారులను నిలదీస్తున్న చైర్మన్ గిరిబాబు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మదన్‌మోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ ఉపాధ్యాయులు, పాఠశాలలు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సర్వీస్‌రూల్స్ లేని కారణంగా ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టడం లేదని, దీని వలన అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ పొందుతున్నారన్నారు. తక్షణమే సర్వీస్-రూల్స్ అమలు చేయాలని కోరారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలు లేని కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే పిఎఫ్ ఖాతాలు తెరిపించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుభాష్ బాబు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచాలని, పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్, సంఘం కార్యదర్శులు దాసరి రామ్మోహనరావు, చావలి శ్రీనివాస్, ఎస్ చాణిక్య, ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, జి.భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌వి అనిల్‌కుమార్, సదాశివుని శంకరరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని మహిళ గురువారం రైలు కింద పడి మృతి చెందింది. ఈమె సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుంది. తెల్లని చాయకలిగి నీలిరంగు చీర ధరించి ఉంది. ఈమె కుడిచేయి విరగటంతో పిండికట్టు వేయబడి ఉంది. ఈమె చీరకట్టు విధానం చూస్తే ఒరియా బ్రహ్మణ మహిళగా కనిపిస్తుంది. అయితే ఈమె టెక్కలి నుంచి ఒడిశా మధ్య ప్రాంతం అయి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. ఉదయం 7 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్లే గుర్తుతెలియని రైలు కిందపడినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న జిఆర్‌పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి

వసుంధరలో ఘర్షణ

మెళియాపుట్టి : మండలంలోని వసుంధరలో ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ విషయంలో బుధవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎస్.వినోద్‌కుమార్, వెంకటరావు, మహేష్, పృథ్వీ, బి.రాజేష్, కృష్ణ, బి.శరత్ తులసి, తేజేశ్వరరావులు కలిసి జానం లక్ష్మీపతిని కొట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ నల్లి సాయి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు.


అవగాహన కల్పిస్తూ విద్యార్థినుల వేషధారణలు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- పొందూరు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తాడివలస పిహెచ్‌సి వైద్యాధికారులు జి.రమేష్‌నాయుడు, నవీన్ కళ్యాణం అన్నారు. మండలం లోలుగు కెజిబివి పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భంతో ఉన్నప్పుడే లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్ల అని తెలియగానే చంపేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం పిసిపిఎన్‌డిటి యాక్ట్‌ను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. లింగ నిర్ధారణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు వివిధ వేషధారణలతో చేసిన ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపి గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. పట్టణంలో తాపీమేస్త్రి, రజక సంఘం, ఎలక్ట్రీషియన్ యూనియన్ల నాయకులతో వేర్వేరుగా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను గెలిపించాలని ఎప్పటిలాగనే అందరకీ అందుబాటులో ఉంటానని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతం కావాలంటే టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, ఆసీ లీలారాణి, ఆసీ చిరంజీవులురెడ్డి, కోటి, జగన్నాథమేస్త్రీ, ఈశ్వరరావు, పూర్ణ, పాపారావు, వెంకటరమణ, సూర్యనారాయణ, రంగాల శ్రీను పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

తహశీలార్దగా ఆదిలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లావేరు

మండల తహశీల్దార్‌గా పి.ఆదిలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. డిటి డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన సాధు దిలీప్ చక్రవర్తిని విజయనగరం జిల్లా తెర్లాంకు బదిలీ కాగా ఆదిలక్ష్మి విజయనగరం జిల్లా డెంకాడ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీలపై వేరే పాఠశాలకు వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు గురువారం సత్కరించారు. ఇటీవల వరకు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన బి.తమ్మయ్య, ఉపాధ్యాయులు బాలక శ్రీనివాసరావు, అప్పల నరసమ్మ, చంద్రశేఖర్, బెందాళం నీలాచలం, గార రాంబాబు అందించిన సేవలు గుర్తుచేస్తూ జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, పండి సత్యనారాయణ, రంగారావు, పద్మనాభం, ఆరంగి వెంకటరావు, పాతిన వెంకటరావు పాల్గొన్నారు.

వైసిపిని ఓడించడమే లక్ష్యం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపిని ఓడించడమే లక్ష్యమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కంజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని తర్లిపేటలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అన్ని తరగతుల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే బిసిలకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్న హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి శైలజ, గొండు లక్ష్మణరావు పాల్గొన్నారు.


అచ్చెన్నను కలిసి యాదవులు

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదుకుంటామని అచ్చెన్న హామీనిచ్చారు. యాదవ సాధికార జిల్లా కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ స్థానిక టిడిపి కార్యాలయంలో అచ్చెన్నను కలిసి వినతిపత్రం అందజేశారు.


మహిళలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఆమదాలవలస : జగన్ రెడ్డి ఓటమితోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉందని జిల్లా టిడిపి న్యాయ విభాగం నాయకులు తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం 13వ వార్డు పరిధిలో జూనియర్ కాలేజ్, మెయిన్ రోడ్డుపై టిడిపి నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేశారు.

జీడిపై పార్లమెంట్‌లో ఎంపీ చర్చించాలి


మాట్లాడుతున్న వేణుగోపాల్

ప్రజాశక్తి- పలాస

ఆధారపడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల రైతులు జీడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, జీడి రైతుల సమస్యలపై ఎంపీ రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో చర్చించాలని వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, తామాడ సన్యాసిరావు, వంకల మాధవరావు, మద్దిల రామారావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సిపిఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా జిల్లాలో ఎంపీగా ఉంటూ జీడి రైతులకు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. గతంలో పార్లమెంట్‌లో వ్యాపారులకు పన్ను తగ్గించాలని కోరినప్పుడు రైతులు పండిస్తున్న జీడి పిక్కలకు మద్దతు ధర ఎందుకు ప్రకటించమని అడగడం లేదో చెప్పాలన్నారు. పలాస ప్రాంతంలో జీడి పంటకు ఆధారంగా సుమారు 1300 కుటీర పరిశ్రమలు నడుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా మరో 1200 కుటీర పరిశ్రమలు నడుస్తున్నాయని చెప్పారు. రైతులు ప్రధానంగా ఈ పంటనే నమ్ముకుని 10 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని చెప్పారు. దేశంలో జీడి పంటను పంటల జాబితాలో ఎందుకు చేర్చడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి 80 కేజీల బస్తాను రూ.16 వేలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే చేయకపోతే రైతులకు అండగా నిలిచి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.భీమారావు, కె.ఈశ్వరి, జి.వాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

4న కోలాటం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో ఈనెల 4న ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదులో భాగంగా 1080 మంది మహిళలతో కోలాటం ప్రదర్శిస్తున్నట్లు జిల్లా కళింగ కోమటి సంఘం మహిళా విభాగం అధ్యక్షులు పద్మజ తెలిపారు. గురువారం కళింగ వైశ్య కళ్యాణ మండపంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీనుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ రికార్డును నెలకొల్పడం ద్వారా కళింగ కోమటి సామాజికవర్గం మహిళల ఔన్నిత్యం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమం నిర్వహణకు తనవంతుగా రూ.50వేలు ఆర్థికసాయాన్ని సూరిబాబు అందజేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు తంగుడు జోగారావు, కోరాడ చంద్రభూషణగుప్త, తంగుడు నాగేశ్వరరావు, ఊన్న నాగరాజు, కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, మహిళా సంఘం జిల్లా సెక్రటరీ లాడే శాంతిప్రియ, ట్రెజరర్ తంగుడు జ్వాల, వర్కింగ్ ప్రెసిడెంట్ తాలాసు కవిత పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఎంపిడిఒ కె.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు ఈమె మన్యం జిల్లా బలిజిపేట నుంచి బదిలీపై టెక్కలి వచ్చారు. టెక్కలిలో పనిచేస్తున్న చింతాడ లక్ష్మీబాయి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో వేసవికాలం దృష్టిలో పెట్టుకొని తాగునీరు ఇబ్బందులు లేకుండా చూస్తారని అన్నారు. ముందుగా మండల కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెచ్.వి.రమణమూర్తి, ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎపిఎం గురుబెల్లి నారాయణరావు పాల్గొన్నారు.

కవిటి: మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారి కె.శ్రీనివాస రెడ్డికి ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎంపిడిఒగా పనిచేస్తున్న పి.సూర్యనారాయణరెడ్డికి ఇటీవల విజయనగరం బదిలీ చేశారు. దీంతో ఖాళీగా ఉన్న ఎంపిడిఒ పోస్టును ఎఒ శ్రీనివాసరెడ్డితో భర్తీ చేశారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎచ్చెర్ల పద్మజ బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయనగరం జిల్లా కొత్తవలస మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన కుప్పిలి పణీంద్రకుమార్ మన్యం జిల్లా సాలూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీపై వెళ్లారు.


టెక్కలి రూరల్ : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

కొత్తూరు : స్థానిక ఎంపిడిఒగా పి.త్రివిక్రమరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా మెంటాడకు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ ఎం.పావని విజయనగరం జిల్లా మెరకముడిదాం ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు.

రాష్ట్రానికి మళ్లీ జగనే సిఎం

ప్రజాశక్తి- రణస్థలం

ఈ రాష్ట్రానికి మరలా జగనే సిఎం అవుతారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రం దన్నానపేట జంక్షన్ వద్ద ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నూతన కార్యాలయాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి మరలా సిఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డే అవుతారన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండల ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, రణస్థలం మండల జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎచ్చెర్ల మండల ఎంపిపి మొదలవలస చిరంజీవి, లావేరు, జి.సిగడాం మండల ఎంపిపి ప్రతినిధిలు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకట రమణ, లావేరు, జి.సిగడాం మండల జెడ్‌పిటిసిలు మీసాల సీతంనాయుడు, కాయల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, దన్నాన రాజీనాయుడు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణదాస్, కిరణ్ కుమార్

అరసవల్లి సందర్శన


జ్ఞాపికను స్వీకరిస్తున్న డిఐజి వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం కర్నూలు ఎపి ఎస్‌పి బెటాలియన్ రేంజ్-3 డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణతర్ల సబ్‌స్టేషన్ గొప్పిలి ఫీడర్ పరిధిలో చెట్లు క్లియరెన్స్ చేయనున్నామని తెలిపారు. దీంతో పలాస మండలం నారాయణపురం, కేసుపురం, టెక్కలిపట్నం, పెదంచల, చినంచల, గంగువాడ, కేదరిపురం, రాజగోపాలపురం, బంటుకొత్తూరు, అమలకుడియా, టెక్కలిపట్నం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొందూరు: మండలంలో లోలుగు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో పలు గ్రామాల్లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎస్.భయ్యన్నాయుడు, ఎఇ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలో లోలుగు, బురిడికంచరాం, బాణాం, దల్లిపేట, నందివాడ, కేశవదాసుపురం పంచాయతీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

తెలగలను బిసిలో చేర్చాలి

ప్రజాశక్తి- పలాస

తెలగను బిసి జాబితా చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షులు పల్లంట్ల వెంకటరామారావు (పివిఆర్) డిమాండ్ చేశారు. తెలగలను బిసిలో చేర్చాలనే డిమాండ్ చేస్తూ... ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొనసాగింది. టికెఆర్ కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్రకు పలాసకు చెందిన రాజరాజేశ్వరి తెలగ సంఘం మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

పలువురు సంఘీభావం

బిసి రిజర్వేషన్ పివిఆర్ చేపట్టి పాదయాత్రకు వైసిపి, టిడిపికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు సంఘీభావం తెలిపారు. ముందుగా పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు రైల్వేస్టేషన్ వద్ద పివిఆర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పివిఆర్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తెలగ సంఘ అధ్యక్షులు శీలం రూపుందర్, కౌన్సిలర్ బల్ల రేవతి, శ్రీనివాస్, ప్రతాప్, పుట్టా లోకనాథం, రాజు, భాస్కరరావు, వేణు. గోవింద్ పాల్గొన్నారు.

లావేరు : ఉత్తరాంధ్రలో ఉన్న తెలగలను బిసి జాబితాలో కలపాలని చేపట్టిన పల్లంట్ల వెంకట రామారావు ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించిన పాదయాత్ర గురువారం ఐదోరోజుకు చేరుకోవడంతో లావేరు, రణస్థలం మండలాలకు చెందిన తెలగ సంఘ నాయకులు పలాస కాశీబుగ్గలో పివిఆర్ పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో చిక్కాల కృష్ణారావు, రాయపురెడ్డి శ్రీను, కోలా సూరిబాబు, రాజేష్, పెద్ది శ్రీను, ఆర్.శ్రీను తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఈదులవలసలో హెల్త్ సెంటర్, విశ్రాంతి భవనం, కొండలక్కివలస రోడ్డు, మెదుళ్లవసలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడులో భాగంగా రూ.60 లక్షలతో అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మంచి చదువులు, రావాలంటే అందుకు అనుకూలమైన వాతావరణం ఉండాలని ముఖ్యమంత్రి గుర్తించి నాడు-నేడు కార్యక్రమం చేపట్టి అధునాతనమైన భవనాలు నిర్మించారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 1247 పాఠశాలలు రెండో విడతలో 1056 పాఠశాలలు, 38 జూనియర్ కళాశాలలు నిర్మించారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫోస్టోలో ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా ఆచరించిన నిజాయితీ గల నాయకుడు జగన్ అని కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం అబివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఆ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి రోనంకి జయప్రకాష్, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక


బ్రాహ్మణతర్లాలో పర్యటిస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొందికారి వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసి ఆయా గ్రామాలకు కానుకగా ఇస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హామీనిచ్చారు. మండలంలో చీపి పంచాయతీలో 12 గ్రామాల నుంచి 130 కుటుంబాలు గురువారం టిడిపిలోకి చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బావన దుర్యోధన, దాసరి తాతారావు, టి.భాస్కరరావు, రట్టి లింగరాజు, డొంకూరు తిరుపతి, రాజాన మహేష్, బి.కర్రెయ్య, లబ్బ రుద్రయ్య, సవర లిఖియా, సవర శంకర్, చౌదరి మురళీలు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

మండలంలోని బ్రాహ్మణతర్లాలో టిడిపి కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రాహ్మణతర్లా టిడిపికి కంచుకోటని, ఇక్కడ ప్రజలు నా తండ్రి గౌతు శివాజీతో పాటు తనకు కూడా ఆధారాభిమానాలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణకుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, వడ్డి యాదగిరి, ఆళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు రిఫరీగా గౌతమ్


గౌతమ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ వేదికగా ఈనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు జరుగనున్న 37వ జాతీయ సబ్ జూనియర్ కోర్గీ, 12వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జాతీయ రిఫరీగా శ్రీకాకుళం నగరానికి చెందిన మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఆర్.డి మంగేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మజ్జి గౌతమ్ కొన్నేళ్లుగా తైక్వాండో కోచ్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో టెక్నికల్ అఫీషియల్‌గా, రిఫరీగా పనిచేశారు. జాతీయ పోటీలకు రిఫరీగా నియమితులైన గౌతమ్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గౌతమ్‌ను తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు తైక్వాండో శ్రీను, నొపడ విజయ్‌కుమార్, వైశ్యరాజు మోహన్ తదితరులు అభినందించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు సాక్షిత్ ఎంపిక

37వ జాతీయ సబ్ జూనియర్ కోర్గీ ఛాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన జామి సాక్షిత్ ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సాక్షిత్ గోల్డ్ మెడల్‌ను సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరే ముందు తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్‌ను కలిసిన సందర్భంలో సాక్షిత్‌ను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

వసతిగృహాల్లో పిల్లలకు పోషకాహారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వసతిగృహాల్లోని పిల్లలకు మంచి పోషకాహారాన్ని అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని అరసవల్లిలోని బాలసదన్, శిశుగృహాలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలకు మంచి పోషకాహారం అందేలా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లలపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈయన వెంట బాలసదన్ సూపరింటెండెంట్ పుణ్యవతి, మ్యాట్రిన్ సుజాత, శిశుగృహ మేనేజర్ నరేష్, సోషల్ వర్కర్ రాంబాబు ఉన్నారు.

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ ఎంతో కీలకమని, లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే సాధ్యం కానిది ఏమీలేదని అమెరికాలోని కాలిఫోర్నియా ఎనర్జీ కమిషన్ వైస్ చైర్మన్ గుండ శివ గంగాధర్, శాస్త్రవేత్త గుండ విశ్వనాథ్ పేర్కొన్నారు. జీవితంలో వచ్చే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం శ్రద్ధ, తపనతో ముందుకు సాగాలన్నారు. గురువారం నగరంలో హెచ్‌బి కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. ఎనర్జీ రంగంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ భాద్యతలు, సవాళ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, డైరక్టర్ అన్నెపు రమేష్‌బాబు పాల్గొన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

నరసన్నపేట : టిడిపితోనే గ్రామల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పట్టణంలోని బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.చిట్టిబాబు, బోయిన ఆనంద్, ఊర్ల పెద్దబాబు, జామి వెంకటరావు పాల్గొన్నారు.

స్పెల్‌బి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్పెల్‌బి పోటీలకు నగరంలో బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయి ప్రియదర్శిణి ఎడ్యుకేషనల్ సోసైటీ అధ్వర్యాన నిర్వహిస్తున్న విశాఖ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఎన్.మహతి మణిబాల ఎంపికైంది. ఇటీవల రాష్ట్రస్థాయి స్పెల్‌బి పోటీలు విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం జ్ఞాన నికేతన్ స్కూల్‌లో జనవరి 7న జరిగాయి. జిల్లాస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆమె తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల చైర్మన్ డా. కె.మధు సూదన్, హెచ్‌ఎం పి.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మహతి మణిబాలను అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న మధుసూదన్

దువ్వాడ శ్రీనివాస్ విస్తృత పర్యటన


కోటబొమ్మాళి : గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, పోలవరం, తిర్లంగి, పెద్దసాన, పరుశురాంపురం, చాకిపల్లి, కె కొత్తూరు పంచాయతీల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ మేరకు నాయకులను, కార్యకర్తలను కలిసి ప్రజా సమస్యపై చర్చించి కార్యకర్తలు భరోసా ఇస్తున్నారు. కార్యక్రమంలో టెక్కలి మండలం నాయకులు చింతాడ. గణపతి, జెసిఎస్ కన్వీనర్ శిగిలిపల్లి మోహన్, తమ్మన్న కిరణ్, కిల్లి అజయ్ కుమార్, బమ్మిడి తులసీరావు, కూన సూర్యారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: త్వరలో జరగనున్న ఎన్నికలు టిడిపి చివరి ఎన్నికలని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కస్తూరిపాడు, దుప్పిలపాడు, విశ్వనాథపురం, రేగులపాడు, సౌడాం, నారాయణవలస, కోటబొమ్మాళి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణ్, వైఎస్ ఎంపిపిలు దుక్క రోజా, రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రం ప్రారంభం


జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

జన ఔషధ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గురువారం వెంకటాపురంలో లావేరు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జన ఔషధ కేంద్రాన్ని డిసిసిబి అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఈ ఔషధ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. డిసిసిబి అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో డిసిసిబి ఆధ్వర్యంలో 25 బ్రాంచ్‌లు ద్వారా రైతులకు రూ.550 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. పిఎం జన ఔషధ కేంద్రం ద్వారా 50శాతం రాయితీతో మందులు అమ్మడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడ చిన్నారావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, సర్పంచ్ బొంతు ఎల్లం నాయుడు, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి చంటిబాబు పాల్గొన్నారు.

సహారా ఇండియా బాధితుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

ప్రజాశక్తి- నరసన్నపేట

సహారా ఇండియా బాధితులకు న్యాయం చేయాలని బాధితులు, ఖాతాదారులు నరసన్నపేటలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా ఇండియా ఖాతాదారులు న్యాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం పోర్టల్ పెట్టిందని, కానీ ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదని అన్నారు. సహారా పోర్టల్ ఒక బూటకమని పేర్కొన్నారు. 45 రోజుల్లో డబ్బులు జమ చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారని గుర్తు చేశారు. పోస్టల్‌లో దరఖాస్తు చేసి వంద రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి చెల్లించకుండా కొర్రీలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సహారా ఇండియా బాధితుల యూనియన్ నాయకులు కె.వరప్రసాదరావు, నాగేశ్వరరావు, పుక్కళ్ల లక్ష్మణరావు, ఎస్.పెంటబాబు, అలిగి రామారావు, జాజువ, కె.నరసింగరావు, ఎస్.జోగారావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం

శ్రీకాకుళం అర్బన్ : ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించి, గ్రామాల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నదే ప్రభుత్వ ఆశయమని, అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించడం జరుగుతోందని కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. నగరంలో 48 సచివాలయాల పరిధిలో నిర్వహించిన క్రీడాకారులకు గురువారం తన వ్యక్తిగత ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వ్యాయామం ద్వారా ఆరోగ్యానికి మేలు చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం రూపకల్పన జరిగిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు రాణించారని, వారి అడుగుజాడల్లో ప్రతిక్రీడాకారుడు కృషి చేయాలన్నారు. విజేతలుగా నిలచిన క్రీడాకారులకు రూ. 10వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిల్లల నీలాద్రి, బాస్కెట్ బాల్ కోచ్ జి.అర్జున్ రెడ్డి, కెప్టెన్ రవి పాల్గొన్నారు.


నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న సూరిబాబు

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మారుతున్న ఆహారపు అలవాట్లు నేపథ్యంలో క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెకెసి సంస్థ అధినేత జల్లేపల్లి గిరిధరరావు అన్నారు. విజయవాడలో ఫన్ టైం క్లబ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన సందర్భంగా కాస్మోపాలిటిన్ క్లబ్ ప్రతినిధులు గురువారం ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 70 ఏళ్ల పైబడిన కేటగిరీలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానం సాధించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాంకింగ్ ఏడాది పాటు ఉంటుందని తెలిపారు. ఏడాదిన్నరగా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధిస్తున్నానని, దానికి క్లబ్ ప్రతినిధులు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డిఇఇ ఎం.వి.సురేష్ మాట్లాడుతూ మిక్స్ డ్ డబుల్స్ విభాగంలో ఛాంపియన్‌గా నిలవడం, డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కోచ్ ఈశ్వర్ యాజి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ సురంగి మోహనరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ట్రెజరర్ జి.సత్యంనాయుడు, ఎ.సెల్వన్, ఎటిఒ పి.గోగరాజు, ఎం.వి.రమణలు, వంశధార ఎస్‌ఇ డోల తిరుమలరావు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బోరు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో 15వ వార్డు పాతినవారివీధిలో ప్రాంతీయ పశు వైద్య కేంద్రం ఆవరణలో ఉన్న బోరు మోరాయించడంతో పశువైద్య సిబ్బంది పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు 50 మంది రైతులు పాడి పశువుల చికిత్స కోసం, కృత్రిమ గర్భోత్పత్తి కొరకు, కుక్కల పెంపకందారులు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుటకు ఈ ఆస్పత్రికి తీసుకువస్తుంటారు. మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులుండగా 6,7వ వార్డులకు సంబంధించి వైద్య కేంద్రం చింతాడలో ఉండగా, మిగిలిన 21 వార్డులు, సమీప గ్రామీణ మండల రైతులు తమ పశువులను తీసుకొని ప్రాంతీయ పశువైద్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకువస్తారు. ప్రాంతీయ పశువైద్య కేంద్రంలో ఉన్న బోరు నెలరోజుల నుంచి మొరాయించడంతో అక్కడ పనిచేస్తున్న పశువైద్య సిబ్బంది, పశు పోషకులు నీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు, మున్సిపాలిటీ ఎఇ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు మున్సిపాలిటీకి సంబంధం లేదని తెలియజేశారని వాపోయారు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బోరు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.


మొరాయించిన బోరు



క్షేత్ర పర్యటనకు వెళ్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో వావిలపల్లిపేట వద్ద మోడల్ స్కూల్ ఒకేషనల్ విద్యార్థులకు గురువారం క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులను ఎచ్చెర్ల మహిళా ప్రాంగణంలో మహిళలకు కంప్యూటర్‌లో టైపింగ్ సాఫ్ట్‌వేర్, టైపింగ్‌లో నైపుణ్యాల్లో అందిస్తున్న శిక్షణను విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయులు మంగమ్మ, మాలతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారతీ దివ్య

పక్కాగా కుల గణన సర్వే

ఇచ్ఛాపురం : సచివాలయం పరిధిలో పక్కాగా కులగణన సర్వే చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య అన్నారు. పరిపాలక సంఘం పరిధిలోని లాలాపేట్ సచివాలయంలో ఎంఎల్‌ఒ సాయిసందీప్ అధ్యక్షతన వాలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సిఎం జగన్ అందిస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి టెంకా లోకేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ మధుసూదనరావు

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి- పలాస

పలాస తహశీల్దార్ కార్యాలయంలో పనిచేయడం ఆనందంగా ఉందని, బదిలీపై వెళ్లడం బాధగా ఉందని తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది గురువారం రాత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో సంతోషంగా పనిచేశానని చెప్పారు. భూ సమస్యలపై తగాదాలు లేకుండా, కోర్టులో ఉన్న కేసులను పరిష్కారం దిశగా కృషి చేశాన్నారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీనారాయణ, పౌరసరఫరాలశాఖ డిటి రవికుమార్, ఆర్‌ఐ నిరంజన్, విఆర్‌ఒలు సోమేశ్వరరావు, ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా గోవిందరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జె.ఆర్.పురం ఎస్‌ఐగా కూన గోవిందరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇచ్ఛాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రథమ కర్తవ్యమని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ గుండపు రాజేష్ కంచిలి బదిలీ అయ్యారు.

ఆమదాలవలస: శ్రీకాకుళం సిసిఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ కె.వెంకటేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐ-1గా పనిచేసిన వై.కృష్ణ బదిలీపై విశాఖపట్నం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.


శ్యామలరావు దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ మణెమ్మ

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- పొందూరు

ఉద్యోగులు తమ విధుల నిర్వాహణకు అంకితమై అందించిన సేవలే సమాజంలో ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని, గ్రామంలో పైడి శ్యామలరావు అందించిన సేవలు మరువలేనివని తాడివలస సర్పంచ్ దంపతులు తమ్మినైన మణెమ్మ, జగన్నాథరావు అన్నారు. మండలం తాడివలస బిసి వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ పైడి శ్యామలరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం రాత్రి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్యామలరావు వార్డెన్‌గా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శ్యామలరావు దంపతులను జ్ఞాపిక, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.